# భలే ముహూర్తం!



* రచన : శ్రీ బచ్చు వీరరాజు *

'అమ్మా!' ఒక్కసారిగా గావుకేక పెట్టాను. ఆ కేక యిల్లంతా ప్రతిధ్వనించింది.

కంగారు పడిపోయి, అమ్మ వంటింట్లోంచి పరుగెత్తుకొని వచ్చింది.

'ఎవడ్రా? అంతలా అరచిన ముష్టివెధవ!' గర్జించింది ఒక్కసారి వీధిలోకి చూస్తూ.

'ముష్టివెధవ కాదు! అరిచింది నేనే!' అన్నాను నెమ్మదిగా తలవంచుకొని.

'అరె! నువ్వట్రా రాజూ! ఏం, ఏమైంది?' అంటూ నా దగ్గర కొచ్చి నా తల నిమరసాగింది అమ్మ.

'అమ్మా! నాకీ జన్మలో శోభనం అయ్యే రాత వుందంటావా? దిగులుగా అడిగాను.

'అవేం మాటరా? మీ మామయ్య కట్నం బాబతు బాకీ, యింకా పదివేలు యివ్వకుండా దాటవేశాడటగా కాబట్టి, లేకపోతే నిక్షేపంలా జరిగేది' అమ్మబాధపడుతూ అంది.

'నేను వీధిలోకి వెళ్ళినప్పుడల్లా, మిత్రులంతా 'సగం పెళ్ళి అయిన వెధవా' అని ఎగతాళి చేస్తున్నారు. నేనింక బ్రతకదల్చుకోలేదు. మా శోభనం జరిగివుంటే ఈపాటికి ముగ్గురిబిడ్డల తండ్రి నయ్యేవాడిని. అక్కడ లత! ఇక్కడ నేను తపించిపోతున్నాం' ఏడుస్తూ అన్నాను.

అమ్మ తట్టుకోలేకపోయింది. నన్ను మరింత దగ్గరకు తీసుకొని 'ఒరే బుజ్జీ! ఈ రాత్రి మీ నాన్నగారితో తాడో, పేడో తేల్చుకొంటాను. ఏడవకు నాన్నా!' అంటూ బుజ్జగించింది.

నేను సంతోషంగా బుర్ర వూపుతూ కళ్ళు తుడుచుకొన్నాను.

* * *

మర్నాడు తెల్లవారింది. లేచి దూర్వాస మహామునిలాంటి నాన్నగారి కంటబడకుండా తప్పించుకొన్నాను.

ఆయన షాపులోకి వెళ్ళిపోగానే, అమ్మ నా దగ్గరకు వచ్చి 'ఒరేయ్! బుజ్జీ! రేపు వచ్చే ఆదివారమే నీ శోభనం! రాత్రే మీ నాన్నగారు మీ మామయ్యకు వుత్తరం వ్రాసి, ఆ రోజుకు లతనూ, అత్తయ్యనూ తీసుకొచ్చేయమన్నారు. యించక్కా బెంగాలీ బాబులా డ్రెస్‌లు కుట్టించుకొని సిద్ధంగా వుండు!' అంటూ నా చేతికి ఓ వెయ్యి రూపాయలిచ్చింది.

ఒక్కసారిగా ఏనుగులా అయిపోయి గబగబా అమ్మ దగ్గరకెళ్ళి 'హా మంచి అమ్మ' అంటూ పెనవేసుకొన్నాను.

* * *

ఆ మర్నాటికే నా డ్రెస్‌లు సిద్ధమయ్యాయి. స్నేహితుల నందర్నీ ఆదివారం రోజున యింటికి రమ్మని ఆనందంగా పిలిచి వచ్చాను. బజారులోని పూల రంగయ్యకి పదిబుట్టల పూలు పురమాయించాను.

రోజుకో యుగంలా గడుస్తోంది. మనసు గాలిలో ఎగిరిపోతోంది. లతతో డ్యూయెట్ సాంగ్ వూహించుకొంటూ గడిపేస్తున్నాను.

# నిత్యజీవిత సూక్తులు!

★

అరెస్టు అంటే ఏమిటి నాన్నా—అవకతవకలకిచ్చే రెస్టు బిడ్డా!

అబద్ధం చెప్పడానికి తయారు—నిజం పలకడానికి పరారు!

ఆపరేషన్ ఆడదానికి కాదు—మగాడికి కాదు. నిగ్రహశక్తి వుండగలిగితే చాలు!

ఇంటి గోవును చంపనేల—కాశీయాత్ర చేయనేల!

ఉన్నవాడూ, ఉన్నవాడూ కలిస్తే—ఊళ్ళకు ఊళ్లు కొన్నట్లే!

ఉన్నవాడికి పిసినారితనం పోదు—లేనివాడికి పొదుపుతనం చేతకాదు!

---

ఆ రోజే ఆదివారం! ఇల్లంతా మారాములమ్మ ముగ్గులతో నింపేస్తే, మా ఏడుకొండలు గుమ్మాలన్నీ మామిడి తోరణాలతో నింపేశాడు.

ఉదయం పది గంటలయ్యింది, నేను బెంగాలీ బాబులా ముస్తాబై వీధిలో నుంచున్నాను. ఇంతలో ఓ వ్యక్తి ఆదరాబాదరాగా వచ్చి, ఓ వుత్తరం నా కందించి వెళ్ళిపోయాడు. అది నాన్నగారికి వ్రాసిన వుత్తరం. తీసి చదివాను.

వైజాక్.

నారాయణ బావా!

నాతో పరాచికాలాడటం కాకపోతే 'ఏప్రిల్ ఫస్టు'న మా అమ్మాయి లతకీ, మీ రాజుకూ శోభనం ముహూర్తం పెడ్తావా? వచ్చే పుష్కరానికి నీ బాకీ చెల్లుచేసి, నేనే ముహూర్తాన్ని వుంచుతాను. అంతవరకూ ఓపికపట్టు.

వుంటాను.
గోవిందరావు,

అంతే! నా...న్నా...నువ్వు...నరకానికి...పోతావు' అంటూ కూలబడిపోయాను.

---



**మా శ్రేయోభిలాషులకు**
**దీపావళి శుభాకాంక్షలు**

---

ఎడమచేత్తో ఇచ్చేది అగౌరవం—కుడిచేత్తో ఇచ్చేది సగౌరవం!

కైలాసం కొరకు కొందరి సాహసం—గృహ నివాసం వరకు ఉపవాసం!

చాకలి కొత్తదిగ వుండాలి—మంగలి పాతగ వుండాలి!

ఢిల్లీకి ప్రభువైతేనేం—ఒక తల్లికి కొడుకే కదా!

తల్లిదండ్రుల దిష్టి గడప దాటదు—భార్యాభర్తల ముష్టి పడక దాటదు!

పేదవానికి పెళ్ళామే భాగ్యం—పెళ్ళానికి పేదైనా కోరేది సౌభాగ్యం!

భోజుడంతటివాడు వున్నప్పుడు—కాళిదాసు అంతటి కవి వుండక తప్పదు!

మన దరిద్రం పరుగెత్తింది—మనకు ముందే ఎదురైంది!

మిడిమిడి జ్ఞానం ఎగిరి పడుతుంది—గుణగణ జ్ఞానం నిలబడి నడుస్తుంది!

—ఉమ్మిడి సత్యాదేవి

★